ప్రజాశక్తి

ఆదివారం 3 డిసెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ప్రత్యేక శిబిరాలకు మిశ్రమ స్పందన

- ఓట్ల తొలగింపు, చేర్పులు, మార్పులపై పరిశీలన
- ఫారం-7 దాఖలుపై అభ్యంతరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపునకు సంబంధించి ఎన్నికల కమిషన్ శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలకు మిశ్రమ స్పందన వచ్చింది. ప్రత్యేక శిబిరాలకు కొన్ని చోట్ల పదులసంఖ్యలో అర్జీలు రాగా కొన్ని గ్రామాల్లో కేవలం 10 లోపు మాత్రమే వచ్చాయి.

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు దృష్టి సారించాయి. రానున్న ఎన్నికల్లో గెలుపునకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాలపై నిశిత పరిశీలనకు హడావుడి చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు తమ ప్రజా ప్రతినిధుల ద్వారా అధికారులపై వత్తిడి తెచ్చి మార్పులు, చేర్పులు, తొలగింపుల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. టిడిపి నాయకులు మాత్రం పోలింగ్ కేంద్రాలకు వెళ్లి జాబితాలను పరిశీలించారు. గత నెల 4,5 తేదీల్లో ఇదే రీతిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. మరోసారి అవకాశం ఇచ్చేందుకు ఈనెల 2,3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. జాబితాలపై అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 9వ తేదీ చివరితేదిగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది.

గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాపై స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా శని వారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులపై వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా బిఎల్‌ఓలు

గుంటూరు నగరం 16వ డివిజన్‌లో ఓటరు జాబితా పరిశీలనకు వచ్చిన ఓటర్లు

హాజరయ్యారు. పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న స్పెషల్ క్యాంపెయిన్‌ను ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా పలు కేంద్రాలను పరిశీలించారు.

స్పెషల్ క్యాంపుల్లో ప్రజల నుండి నూతన ఓటుకై దరఖాస్తులు, ఓటర్ కార్డులో చిరునామా, పేరు, పుట్టిన తేది తదితర మార్పులకు దరఖాస్తులు అందాయి. వీటితో పాటు వేర్వేరు కారణాలతో తొలగింపునకు ఫారం-7 కూడాపెద్ద సంఖ్యలో దాఖలు చేశారు. వీరిలో స్థానికంగా ఉండటం లేదని, పలువురు మృతి చెందారని, బోగస్ ఓటర్ల పేరుతో వైసిపి నాయకులు భారీగా దరఖాస్తులు అందిస్తున్నారని, తమ పార్టీ ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలకు టిడిపినాయకులు తప్ప ఓటర్లు చాలా తక్కువ మంది రావడం కన్పించింది. గుంటూరు జిల్లాలో మృతి చెందిన ఓటర్లు పెద్దసంఖ్యలో ఉన్నారని, వీరిని తొలగించాలని టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. 7 నియోజకవర్గాల పరిధిలో 10,513 మంది మృతి చెందినవారి పేర్లు జాబితాల్లో కొనసాగుతున్నాయి. తెనాలిలో అత్యధికంగా 2,899 పేర్లున్నాయి. డబల్ ఎంట్రీలు 10,727 పేర్లు ఉన్నాయి. గుంటూరు తూర్పులో అత్యధికంగా 4,458 మంది, పొన్నూరులో అత్యల్పంగా 108 పేర్లున్నాయి. ఓటర్ల జాబితాలో ఉండి అందుబాటులో లేని వారు 5295 మంది ఉన్నట్టు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో నకిలీ ఓట్లు 18 వేల వరకు ఉన్నాయి. చనిపోయిన ఓటర్లను ఇంకా తొలగించలేదు. జిల్లా వ్యాప్తంగా 23 వేల మంది మృతి చెందిన వారిపేర్లు జాబితాల్లో కొనసాగుతున్నాయి. జీరో డోర్‌నెంబరుతో 5019 వరకు ఉన్నాయి. ఓటర్ల తుది జాబితాలను వచ్చేనెల 5న కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది.

తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో గుంటూరు కలెక్టర్, పల్నాడు జెసి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

భారత వాతావరణ శాఖ జారీ చేసిన తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శనివారం కలక్టరేట్ నుండి జెసి రాజకుమారితో కలిసి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను హెచ్చరికల కేంద్రం, భారత వాతావరణ శాఖ, స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వలన ఈనెల 3వ తేది నుండి జిల్లాలో వర్షాలు పడే అవకాశం వుందన్నారు. ఈనెల 5వ తేది నెల్లూరు - మచిలీపట్నం వద్ద తుఫాను తీరం దాటే అవకాశం వుందన్నారు. తీరప్రాంత జిల్లాలతో పాటు గుంటూరు జిల్లాలో కూడా భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు పంట నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు. వరి పంట కోత చేసి పంట పొలాల్లో వదిలేస్తే ధాన్యం దెబ్బతినవచ్చన్నారు. పైతేదీలలో పంటల కోత చేయకుండా రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో సూచనలు అందించాలని చెప్పారు. బలమైన గాలులు కూడా వీచే అవకాశం వున్నందున కరెంట్ స్తంభాలు దెబ్బతినే అవకాశం వుందని, అందువల్ల కరెంట్ సరఫరా అంతరాయం ఏర్పాడే అవకాశం వున్నందున విద్యుత్ శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుచ్ఛక్తి సరఫరాను క్రమబద్ధీకరించాల్సి

సమీక్షలో గుటూరు కలెక్టర్, పల్నాడు జెసి

వుంటుందన్నారు. గాలుల వలన రోడ్లపై చెట్లు కూలితే ఆర్‌అండ్‌బి, పంచాయితీరాజ్ శాఖ అధికారులు వాటిని తొలగించి రోడ్డు ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సి వుందన్నారు. మున్సిపల్ కమిషనర్లు వర్షపు నీరు నిల్వ వుండకుండా, కాల్వల్లో నీటి ప్రవాహం సరిగా జరిగేలా పూడికలు తీసి క్రమబద్ధీకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి నష్టమేమీ వాటిల్లకుండా అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : తుపాను నేపథ్యంలో నష్టనివారణపై అధికారులో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ టెలికాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి పంట నష్టపోకుండా చూడాలన్నారు. పాత, అవసాన దశలో ఉన్న భవనాలను గుర్తించి అందులోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. గాలి తీవ్రత సుమారు 65-80 కిలోమీటర్ల వరకు ఉండే అవకశం ఉన్నందున కరెంటు స్తంభాలు పడి పోకుండా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు.

గుంతలను పరిశీలిస్తున్న గద్దె చలమయ్య తదితరులు

రహదారి ధ్వంసం దారుణం

సత్వరమే చదును చేయకుంటే ఆందోలన : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లిలో అమరావతి మేజర్ పెద్దకాలవ కుడివైపు రోడ్డును తవ్వటమే కాక బారీకేడ్లు పెట్టి రైతులకు పంట పొలాలకు వెళ్లే దారులను ధ్వంసం చేయడం దారుణమని, గుంతలను సత్వరమే చదును చేయడంతోపాటు బారీకేడ్లను తొలగించాలని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. ఇటీవల ఓ సామాజిక తరగతికి చెందిన వారు వనభోజనాలు నిర్వహించుకునేందుకు అమరావతి మేజర్ కాల్వ సమీపంలోని ఒక ప్రదేశాన్ని ఎంచుకున్నారు. అక్కడికి వెళ్లేందుకు కుడివైపు కాల్వను కొంత దూరం శుభ్రం చేసి మట్టిని తోలించారు. ఇదిలా ఉండగా మూడ్రోజుల క్రిత అధికారులు ఆ కాల్వ కట్టలను తవ్వారని, ఎవరూ వెళ్లకుండా బారీకేడ్లు పెట్టారని తెలుసుకున్న సిపిఎం నాయకులు ఆ ప్రదేశాన్ని శనివారం పరిశీలించారు. చలమయ్య మాట్లాడుతూ పొలాలకు వెళ్లే ప్రధాన రహదారిలో

2లో

ఉపాధి చూపి వలసలను నివారించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధి హామీ పనులను తక్షణమే చేపట్టి వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు అధ్యక్షతన విస్తృత సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో 400 మండలాల్లో తీవ్రమైన కరువు ఏర్పడిందని, 20-25 లక్షల మంది వ్యవసాయ కార్మికులు వలస పోయారని తెలిపారు. వలసకు వెళ్లిన చోట భద్రత లేక అనేకమంది చనిపోతున్నారని, అక్కడ కూడా పనులు లేక భిక్షాటన చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇంత తీవ్రమైన కరువు పరిస్థితులున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవటం దారుణమని విమర్శించారు. కూలీల కోసం వచ్చిన ఉపాధి హామీ నిధులను భవనాలకు, సిమెంట్ రోడ్లకు మళ్లించి కూలీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కరువు నివారణకు ఉపాధి నిధులు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరుతూ డిసెంబర్ 4న ఢిల్లీలో జరిగే మహాధర్నాలో వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

2లో

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సర్టిఫికెట్లు అందిస్తున్న వీసీ రాజవేఖర్ తదితరులు

కళలకు సరిహద్దులు లేవు

కట్టుబాట్లను చేరిపేసేలా కళా రంగం

జాతీయ ఫైన్ ఆర్ట్స్ ఫెస్టివల్ ముగింపులో వీసీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

కళాకారులకు, కళలకు సరిహద్దులు ఉండవని, భాష ఏదైనా వారి భావంతోనే అన్ని ప్రాంతాలను వారి సొంతం చేసుకుంటారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీ వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్, నేషనల్ ఆర్ట్ ఎగ్జిబిషన్ 2023 శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.అనిత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విసి మాట్లాడుతూ కళాకారులు సాధ్యమైనంత ఎక్కువ బాషల యందు ప్రావీణ్యం పొందాలని సూచించారు. కళలకు ప్రాంతాల మధ్య,

2లో

ఉపాధి చూపి వలసలను నివారించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ డిసెంబర్ 4న ఢిల్లీ మహాధర్నాకు సంఘీభావంగా తాహశీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించాలని కోరారు. జనవరి 5,6 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తత సమావేశం గుంటూరు నగరంలో జరుగుతుందని ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఆత్మకూరు, చిలువూరు తదితర గ్రామాల్లో అనేక గ్రామాల్లో దళితులకు స్మశాన వాటికలకు భూములు కేటాయించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో రెండు పూటలా పని విధానం, మంచినీళ్లు, పార, తట్టకు, గడ్డిపారకు ఇచ్చే డబ్బులు నిలిపేయటం, ఆన్‌లైన్ మస్టర్ విధానం , వేతనాలు వారాల తరబడి పెండింగ్‌లో ఉంచటం వంటివి చట్టాన్ని నీరుగార్చటమేనని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కష్ణా పశ్చిమ డెల్టా ప్రాంతంలో వ్యవసాయ రంగంలో వచ్చిన అనేక మార్పులు వల్ల వ్యవసాయ పనులు తగ్గిపోయాయని, దీంతో వ్యవసాయ కూలీలు పనుల్లేక వలసలు పోతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులకు పనులు లేక ఇబ్బంది పడుతుంటే కూలీలు పనులకు రావట్లేదని పెత్తందారులు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఉపాధి హామీ పనులను కేవలం 25 రోజులు మాత్రమే చేయిస్తున్నారని, చట్టం ప్రకారం కుటుంబానికి వంద రోజులు పని కల్పించాల్సి ఉందని గుర్తు చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.కోటేశ్వరి, నాయకులు నాగేశ్వరరావు, ఎన్.దుర్గారావు పాల్గొన్నారు.

కళలకు సరిహద్దులు లేవు

(మొదటి పేజీ తరువాయి)

భాషల మధ్య అంతరాలు ఉండవన్నారు. అన్ని రంగాలలో కెల్లా కళా రంగానికి ప్రత్యేకమైన స్థానం ఉంటుందని, తన చిన్నతనంలో కళా రంగం పట్ల ఆసక్తి ఉండేదని ప్రస్తుతం తన పిల్లలు కళా రంగంలో ప్రావీణ్యం పొందారని చెప్పారు. ఏడాది క్రితం ప్రారంభించిన స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఎంతో వృద్ధి సాధించిందన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయటం సంతోషంగా ఉందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రానున్న ఆరు నెలల కాలంలో తమిళం, కన్నడం, మలయాళం, యూరోపియన్ భాషలను నేర్పే విధంగా డిప్లమా కోర్సులు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆంధ్ర యూనివర్సిటీలో కల్చరల్ సెంటర్ తిరిగి ప్రారంభమైందని, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కూడా కళలకు నిలయంగా మార్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఫెస్ట్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ప్రస్తుతం ఆర్టిస్టులుగా ఉన్న వారి కోసం ఈవినింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కేరళకు చెందిన విద్యార్థులు వీసీని కోరారు. కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. స్వరూపారాణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, దూరవిద్య కేంద్రం డైరెక్టర్, నూట అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు, ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.శేఖర్‌బాబు, అధ్యాపకులు బి.జాన్ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని చీకటిగలపాలెం మోడల్ స్కూల్‌లో క్రీడాకారులకు 'బీ ద చేంజ్' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను శనివారం అందించారు. సంస్థ ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించాలనే సంకల్పం ఉన్నవారికి క్రీడా కోటాలో ఉద్యోగం సాధించేందుకు క్రీడలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సంస్థ ప్రతినిధులు పి.సురేష్, సిహెచ్.మల్లికార్జునరెడ్డి, కె.విజయ భాస్కర్‌రెడ్డి, అంజిరెడ్డి, సిహెచ్.హేమంత్ పాల్గొన్నారు.

పల్నాడును ప్రకృతి వ్యవసాయ ల్యాబ్‌గా చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని గణనీయంగా మెరుగుపరచి సేంద్రియ ఉత్పత్తులని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకం అన్నారు. నరసరావుపేట మండలంలోని అల్లురివారిపాలెంలో ప్రకృతి వ్యవసాయం విధానాలపై వ్యవసాయశాఖ శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రములో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. మొక్కలు, విత్తనాలు నాటారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ కేవలం 70 సెంట్ల విస్తీర్ణంలో వివిధ పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టడం అభినందనీయమన్నారు. కరువు నివారణ, సూర్య మండలం, 365 రోజుల గ్రీన్ కవరేజ్, మిల్లెట్స్ మోడల్ వంటివి ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ల్యాబ్‌లా జిల్లాను ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ చేపట్టిన వివిధ రకాల మోడల్స్‌ను ఫ్లెక్సీలో పొందుపరచి ప్రదర్శించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సాయి మార్కొండారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ప్రకృతి వ్యసాయం ఉండేదని, మళ్లీ ఇప్పుడు అవలంభించడం అభినందనీయమని అన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీ, ప్రకృతి వ్యవసాయధికారి అమలకుమారి మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రిప్ ఇరిగేషన్‌తో ప్రకృతి సాగు విధానంలో సాగు చేస్తున్న యువరైతు ఏరువ కోటిరెడ్డి పొలాన్ని పరిశీలించి అభినందించారు. ఆదర్శ రైతులు నాగేశ్వరరావు, కోటిరెడ్డి, గురుమూర్తి, సాంబశివరావు, అమరరెడ్డి, కొదండరామయ్యను సత్కరించారు.

జాషువా రచనలు ఆదర్శనీయం

గుర్రం జాషువా రచనలు అందరికీ ఆదర్శమని, స్ఫూర్తి అని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నెలనెలా సాహిత్యం కార్యక్రమంలో భాగంగా శనివారం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో తెలుగు తల్లి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఎజ్రా, ఎస్టీ కార్పొరేషన్ పాలపర్తి కోటేశ్వరరావు, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ సుజాత, విశ్రాంత హెచ్ఎంలు ప్రసాదు, సుబ్బారావు, బాలరాజు మాట్లాడారు.

సిజిజిబి బ్రాంచ్ ప్రారంభం



రొంపిచర్లలో కౌల్దార్లకు రుణ చెక్కు అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - రొంపిచర్ల

జిల్లాలో సుమారు 47 వేల మందికి పైగా రైతులకు రుణాలిచ్చిన బ్యాంక్ చైతన్య గోదావరి బ్యాంక్ అని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రం రొంపిచర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన చైతన్య గోదావరి బ్యాంక్ శాఖను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో జరిగే డిస్ట్రిక్ట్ కన్సల్టేషన్ కమిటీ సమావేశంలో చైతన్య గోదావరి బ్యాంక్ తమవంతు సహకారం పూర్తి స్థాయిలో అందిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.750 కోట్ల మేర రైతులకు రుణాలిచ్చిందని చెప్పారు. సుమారు రూ.12 కోట్లను కౌలురైతులకు రుణాలుగా మంజూరు చేసినట్లు చెప్పి అభినందించారు. అనంతరం కౌల్దార్లకు రుణ చెక్కును అందించారు.

వైసిపిని ఓడించేందుకు సిద్ధంగా ప్రజలు : టిడిపి

పలువుర్ని టిడిపిలోకి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

సైకో పాలనలో రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలో నెట్టివేయబడిందని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. చంద్రబాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 29వ వార్డులో టిడిపి పట్టణ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణానికి శాశ్వత తాగునీటి పరిష్కారానికై గత ప్రభుత్వం నుండి రూ.161 కోట్లు నిధులు తెస్తే ఆ పథకం పూర్తి చేయటం ఇప్పటి ఎమ్మెల్యేకు చేతకాలేదన్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామి కొండకు ఘాట్ రోడ్డు నిర్మాణం ప్రారంభించింది టిడిపియేనని, తిమ్మాయపాలెం రోడ్డులో సిసి రోడ్డు, కాల్వకట్టపై ఇరువైపులా సిసి రోడ్లు, వందల కోట్లు విలువచేసే ఎన్.ఎస్.పి స్థలాన్ని మున్సిపల్ అభివృద్ధికి బదలాయింపు, 11 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణం ఇలా అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టింది టిడిపి ప్రభుత్వ హయాంలోనేనని అన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని పొలిటికల్ రియల్ ఎస్టేట్ చేస్తూ ప్రభుత్వ భూములను ఆక్రమించి సొమ్ము చేసుకున్నారని దుయ్యబట్టారు. ఓటమి భయంతో టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. త్వరలోనే వైసిపితోపాటు అధికారం అడ్డం పెట్టుకొని ప్రజాధనాన్ని దోచుకున్న వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ప్రజలు త్వరలో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేనా పార్టీ నియోజక వర్గం సమన్వయ కర్త కొణిజేటి నాగ శ్రీను రాయల్, టిడిపి నాయకులు షమీం ఖాన్, సౌదాగర్ జానీ బాష, గంధం సుబ్బారావు, పివి సురేష్ బాబు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక..

29వ వార్డు టిడిపి నేత గ్రంధం సుబ్బారావు అధ్వర్యంలో వైసిపికి చెందిన జవ్వన బోయిన ప్రసాద్, గాజుల శెట్టి, జల్ది రవి, పప్పూరి ఆంజనేయులు, షేక్. నాయబ్ రసూల్, షేక్ ఫాతిమా, దాసరి వీరాంజనేయులు, తుంగ పుల్లయ్య, దాసరి శ్రీను తదితరులు జీవీ ఆంజనేయులు సమక్షంలో టిడిపిలో చేరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

10న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉదోక్యగుల రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - నరసరావుపేట

విజయవాడలో 10వ తేదీన నిర్వహించే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఆర్టీవో కార్యాలయం ఆవరణంలోని సర్వే ఉద్యోగుల సంఘం భవన్‌లో అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం శనివారం జరిగింది. కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ బాబు, ఏపీ జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు పని చేస్తున్నా జీతాలు మాత్రం చాలీచాలకుండా ఇస్తున్నారని, పైగా సంక్షేమ పథకాలను వర్తింపజేయడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సమావేశంలో ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి సిహెచ్ సుశీల, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.వీరస్వామి, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, కోశాధికారి వి.పేరయ్య, నాయకులు షేక్ మాలిక్ మహమ్మద్, పథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - మాచర్ల

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా సవరించాలని మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబుకు టిడిపి నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ ఇప్పటికి ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు ఉన్నాయని, బతికి ఉన్నవారి పేర్లు చనిపోయినట్లుగా తొలగించారని, ఒకే వ్యక్తికి ఒకే జాబితాలో రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని, మరోక చోట గ్రామాలలో ఓటు ఉండి మాచర్ల టౌన్‌లో కూడ ఓట్లు ఉన్నాయని వివరించారు. ఇంటి నెంబరు లేని వారికి ఓట్లు ఇవ్వవద్దని, బిఎల్‌ఓలు కూడ చూపని ఓటర్లను తొలగించాలని, సరైన విచారణ లేకుండా తొలగింపులు ఏకపక్షంగా చేపట్టవద్దని కోరారు. ఉద్దేశపూర్వకంగా చేర్చిన ఓటర్లను తొలగించాలన్నారు. ఈ మేరకు కొన్ని వివరాలను కమిషనర్‌కు ఇచ్చారు. ఈ వివరాలను బిఎల్‌వోలకు ఇచ్చి ఆదివారం విచారణ చేయిస్తామని కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వాసు, బి.బ్రహ్మం, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.బాబు, వేణు, రాముడు, హనుమంతు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

ఓటర్ల మార్పులు చేర్పులలో అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. మండలంలోని ఎ.ముప్పాళ్ల, ఈపూరు గ్రామాలలో టిడిపి నాయకులతో కలిసి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ టిడిపి సానుభూతిపరులు ఫారం-6 దరఖాస్తులను అధికారులు నమోదు చేయడం లేదని, గ్రామంలో నివాసం ఉంటున్నా కొందరు కావాలనే దురుద్దేశంతో ఫారం-7 దరఖాస్తులు పెడుతున్నారని ఆరోపించారు. వైసిపికి చెందిన వారు ఫారం-6 దరఖాస్తులను వెంటనే నమోదు చేస్తున్నారని, ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని చెప్పారు. అనంతరం తహశీల్దార్ సుధాకర్‌కు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ వినతిపత్రం అందజేశారు.

రహదారి ధ్వంసం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

గుంతలు తీయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్వను పాడుచేసిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఉన్నత అధికారులు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక సామాజిక తరగతి వనభోజనాలను అడ్డుకోవడానికి మంత్రి అంబటి రాంబాబు ఆదేశాలతోనే కెనాల్ అధికారులు ఇలా చేసినట్లు ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఒకరోజు వనభోజనాలకి ఉపయోగ పెట్టుకుంటే మిగతా అన్ని రోజులు రైతులు తమ పొలాలకు వెళ్లడానికి మార్గం అదేనని, ట్రాక్టర్లు, అరకలు, వ్యవసాయ కూలీలు వెళ్లడానికి అదే ప్రధాన మార్గమని చెప్పారు. పాడుచేసిన రోడ్డును తక్షణమే బాగు చేయకుంటే రైతుల తరపున సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, నాయకులు జి.బాలకృష్ణ, జి.సుసులోవ్, పి.ప్రభాకర్, పి.రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
ఆదివారం 3 డిసెంబర్ 2023

క్రీడలకు ప్రోత్సాహం

15 నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు : జిల్లాకలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి , సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి తో కలసి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చురుకైన జీవనశైలిని అవలంభించడానికి ఆరోగ్య పరమైన జీవనవిధానాన్ని ఆచరించడానికి జరుగుతున్న "ఆడుదాం ఆంధ్ర" టోర్నమెంట్ ఈనెల 15 నుంచి జిల్లాలో ప్రారంభమవుతా యన్నారు. ఈ పోటీలకు క్రీడాకారుల నమోదు ఇప్పటికే నమోదు ప్రారంభించామన్నారు. సచివాలయాల్లోను, వాలంటీర్ల ద్వారా, 1902 కు కాల్ చేసి 13వ తేదీ వరకు క్రీడలలో పాల్గొనటానికి నమోదు చేసుకోవచ్చున్నారు. డిసెంబరురిజిస్ట్రేషన్ల నమోదుపై ఇప్పటికే ప్రజలకు విస్తత స్థాయిలో అవగాహన కల్పించటం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయం యూనిట్ గా, పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయం యూనిట్ గా క్రీడలను నిర్వహించటం జరుగుతుందని, సచివాలయ స్థాయిలో గెలుపొందిన వారికి మండల స్థాయిలోను అక్కడ గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో, తదుపరి జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను పోటీలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలలో 15 సంవత్సరాలు వయస్సు దాటిన యువతీ, యువకులు పాల్గొనవచ్చుని, క్రికెట్, బాడ్మింటన్, కబడ్డి, ఖో-ఖో , వాలీబాల్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. క్రీడలలో గెలుపొందిన జట్లకు నియోజకవర్గ స్థాయి నుంచి నగదు బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. క్రికెట్, కబడ్డి, ఖో - ఖో , వాలీబాల్ క్రీడాంశాలకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు రూ.35,000, రూ.15,000, రూ. 5000, జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు రూ. 60,000, రూ.30,000, రూ.10,000, రాష్ట్ర స్థాయిలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు రూ.5,00,000, రూ. 3లక్షలు, రూ. రెండు లక్షలు అందిస్తామన్నారు. బాడ్మింటన్ క్రీడాంశానికి నియోజకవర్గ స్థాయిలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు రూ.20,000, రూ. 10,000, రూ. 5,000, జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు రూ. 35,000, రూ. 20,000, రూ. 10,000, రాష్ట్ర స్థాయిలో మొదటి, ద్వితీయ, తతీయ బహుహతులు రూ. 2,00,000, రూ. 1,00,000, రూ. 50,000 అందిస్తారన్నారు. సచివాలయ స్థాయి పోటీలు ఈనెల 15 నుంచి జనవరి 1 వరకు, మండల స్థాయి పోటీలు జనవరి 2 నుంచి 15 వరకు, నియోజక వర్గ స్థాయి పోటీలు జనవరి 16 నుంచి 21వరకు జిల్లా స్థాయి పోటీలు జనవరి 22నుంచి 28 వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు తేది జనవరి 29 నుంచి ఫిబ్రివరి 3వరకు జరుగుతాయన్నారు. జిల్లా కమిటీకి చైర్మన్ గా జిల్లా కలెక్టర్ ఉంటారని, నోడల్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఉంటారని క్రీడల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించటం జరుగు తుందన్నారు. క్రీడాంశాలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, క్రీడా సామగ్రి ఇప్పటికే జిల్లాకు సరఫరా చేయటం జరిగిందని, వీటిని గ్రామాలకు సరఫరా చేయటం జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లాలో 568 గ్రామ, వార్డు సచివాలయాలు, 18 మండ లాలు, 7 నియోజకవర్గాలు మరియు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడలు నిర్వహించుటకు జిల్లా వ్యాప్తముగా 244 క్రీడా ప్రాంగణాలను మరియు 312 పీఈటీలు, పీడీలను ఎంపిక చేయటం జరిగిందన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి క్రీడాంశముల నిర్వహణకు సరఫరా చేసిన క్రీడా పరికరాలను ప్రదర్శించారు. ఆడుదాం ఆంధ్ర మస్కట్ కిట్టు (క్రిష్ణ జింక) తో రూపొందించిన క్రీడల ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి వెంకటేశ్వర్లు, స్టెప్ సీఈవో ఎస్ పల్లవి, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఓటమి భయంతోనే జగన్ రెడ్డి ఓట్లను తొలగిస్తున్నాడని తెలుగుదేశం పార్టీ గుంటూరు నాగ రాధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆరోపించారు.పాత గుంటూరు యాదవ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన ఓటర్ స్పెషల్ డ్రైవ్ లో డేగల ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తన పాలనపై తనకు నమ్మకం లేకనే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు.18 ఏండ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు నమోదుకు యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబంలోని ఓటర్లు వివిధ పోలింగ్ బూతులతో ఉంటే సరి చేయాలన్నారు.నగరం లో భారీ ఎత్తున బోగస్ ఓట్లు నమోదు చేస్తున్నారని, అర్హులైన వారి ఓట్లు తొలగిస్తున్నారని పేర్కొన్నారు.ఓటరు జాబితా అక్రమాలపై నిరంతర పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో జగన్ రెడ్డి అక్రమంగా ఓట్లు తొలగిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు.ఈ కార్యక్రమం లో స్థానిక కార్పొరేటర్ యల్లవుల అశోక్,జాగర్లమూడి శ్రీనివాసరావు, కొండెపు శేఖర్,తాడివాక సుబ్బారావు, కాయల సాంబశివరావు, జడ సురేష్,అశోక్,గట్టు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పాతగుంటూరులోఅధికారులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆదర్శ కమ్యూనిస్టు చేకూరి లక్ష్మీ కాంతారావు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, ట్రేడ్ యూనియన్ రంగం ముఖ్యంగా ఏఐటీయూసీ ఎన్ఎస్పి కెనాల్ వర్కర్స్ యూనియన్ ఆయా రంగాలలో గుంటూరు జిల్లా లో ఉద్యమ వ్యాప్తికై పాటుపడిన సిహెచ్.ఎల్. కాంతారావు లేని లోటు ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని రాదసుందర కళ్యాణమండపంలో జరిగిన కాంతారావు ప్రథమ వర్ధంతి సభకు కామ్రేడ్ వై చెంచయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ ముప్పాళ్ళ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి పాటుపడేది కమ్యూనిస్టులేనని, దేశంలో కుల మత వర్గ రహిత సమ సమాజం కోసం కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తి కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కాంతారావు పరితపించేవాడని 92 ఏళ్ళ వయసులో కూడా ఎర్ర జెండా భుజాన వేసుకొని ప్రజా సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. సభలో పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నరసరావుపేట నియోజకవర్గ టిడిపి బాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, కాంతారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

7న సామాజిక సాధికార బస్సుయాత్ర

విజయవంతం చేయాలని నేతల పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక సాధికారత బస్సుయాత్ర ఈనెల 7వ తేదీన గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దాలి గిరి తెలిపారు. శనివారం స్థానిక పట్టాభిపురంలో గల మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల డిసెంబర్ 7 తేదీ గురువారం మధ్యాహ్నం 3వ గంటలకి జరుగనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిమాట్లాడుతూ సిఎం జగన్ గత నాలుగున్నర ఏళ్ల సామాజిక న్యాయంకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. చుట్టుగుంట సెంటరు లో బస్సు యాత్ర జరుగుతుందన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలు గా అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎస్సి,ఎస్టి, బిసి, మైనార్టీలకు హక్కులను కాపాడేందుకు కృషి జరిగిందన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.డిసిసిబి చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డిప్యూటీ మేయర్‌లు డైమండ్ బాబు, సజీల తదితరులు పాల్గొన్నారు.

కేసులు సకాలంలో పరిష్కారానికి కృషి చేయాలి

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ప్రాసిక్యూషన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పాతూరి మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె..సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్థసారధి, మొదటి అదనపు జిల్లా జెడ్జి సిహెచ్.రాజగోపాల్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు పాల్గొని జిల్లాలో ప్రాసిక్యూషన్ ఏవిధంగా చేయాలి, సమస్యలను ఎలా అదిగమించి, కేసులు నిర్వహించి శిక్షలు పడే విధంగా ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.కళ్యాణి ఎన్‌డిపిఎస్ చట్టంలోని సమస్యలను అధిగమించి, ఎలా ఇన్వెస్టిగేషన్ చేయాలో వివరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సభ్యులు వి.బ్రహ్మారెడ్డి రెండు జిల్లాలను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ ఇన్వెస్టిగేషన్‌కు సహకరించి, కోర్టులలో శిక్షలు పడే విధంగా ఎలా చేయాలో వివరించారు. అనంతరం జరిగిన రెండు జిల్లాల సమీక్షలో సుదర్శన్‌రెడ్డి అనేక సూచనలు చేశారు. అందరూ కోర్టులకు సకాలంలో హాజరై సాక్షులకు సహకరించి, పోలీసులతో చక్కని సహకారంతో ఎక్కువ కేసులలో కన్విక్షన్ సాధించాలని తెలిపారు. బాగా పనిచేసిన అనేక మంది ప్రాసిక్యూటర్లను అభినందించారు. ఇకపై అందరికీ శిక్షలు ఆధారంగా ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఒపి పాతూరి మధుసూదనరావు ప్రొటెస్ట్ పిటిషన్, కేసులు కోర్టులలో జాప్యం కాకుండా ఎలా ముందుకు వెళ్లాలో వివరించారు. కార్యక్రమంలో సమీక్షా సమావేశంలో రాష్ట్ర డైరెక్టరేట్ ఏఒలు గిరి, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

తుపాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

"మిచింగ్ తుఫాను" కారణంగా నరసరావుపేట డివిజన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ కు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఏర్పడినా విద్యుత్ తీగలపై చెట్లు పడటం, విద్యుత్ తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభం పడిపోవడం మరియు ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఫీజులు పోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటే నరసరావుపేట కంట్రోల్ రూమ్ నెం.9491052195, లేదా టోల్ ఫ్రీ నెం.1912 లకు సమాచారం అందించాలని నరసరావుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ శాఖ సిబ్బంది కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఆస్పత్రి అభివృద్ధికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం కోటి రూపాయలు ఇచ్చేందుకు దాత ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ఎపి ఎం ఎస్ ఐ డి సి డిఈ రత్తయ్య ఆధ్వర్యంలో హర్షిత రియల్ ఎస్టేట్ అధినేత కిరణ్ ఆసుపత్రి కి రూ.30 వేల విలువ గల పరికరాన్ని డాక్టర్ కిరణ్ కుమార్ కు అందచేశారు. ఈ సందర్బంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం హర్షిత రియల్ ఎస్టేట్ అధినేత రూ. కోటి ఇస్తానని ముందుకు వచ్చారని ఆయన చెప్పారు. కార్డియోదోరాపిసిక్ విభాగానికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమం లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, మానసిక వైద్య విభాగం వైద్యులు కిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని, బయో మెడికల్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో లభించే సేవల గురించి అవగాహన కోసం రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేందం వైద్యాధికారి పి.శాంతి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.గురుకుమార్, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ బాలస్వామి, ఆరోగ్య మిత్ర కె.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ కె.శ్రీనివాసరావు, రమాదేవి, ఎ.శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

నేడు పాత గుంటూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పాత గుంటూరు యాదవ హై స్కూల్ నందు ఈ నెల 3వ తేదీన జరిగే ఉచిత వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశంపార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ కోరారు.శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరం ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడా రు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ విలేకరుల మట్లాడుతూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యం తో ఉచిత మెడికల్ క్యాంప్ లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు ప్రత్యేక వైద్యుల బృందంతో, అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పేద వాడికి ఎలాంటి ఇబ్బందులకుగురి కాకుండా సాధ్యమైనంతవరకు అన్నివిధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. వారంలో ప్రతి రెండు రోజులు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ లను నిర్వహిస్తామని పేర్కొన్నారు.గుంటూరు ప్రజలందరూ ఈ మెడికల్ క్యాంప్ లో పాల్గొనాలని ప్రభాకర్ కోరారు.

9, 10 తేదీల్లో పల్నాడు జిల్లా బాలోత్సవం

- పోటీల్లో పాల్గొనేందుకు 7 వేల మంది విద్యార్థుల నమోదు
- బ్రోచర్‌ను ఆవిష్కరించిన నిర్వహణ కమిటీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించే జిల్లాస్థాయి బాలోత్సవం (పిల్లల పండుగ)ను జయప్రదం చేయాలని పల్నాడు బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి కోరారు. ఈ మేరకు బాలోత్సవం బ్రోచర్‌ను పల్నాడు రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల 30వ తేదీతో బాలోత్సవాల ఎంట్రీల సమయం ముగిసిందని, ఇప్పటివరకు 7 వేల మంది బాల, బాలికలు వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొనటానికి నమోదు చేయించుకున్నారని తెలిపారు. బాలోత్సవాలకు అనూహ్య స్పందన వచ్చిందని, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల నుండి

విద్యార్థులు చాలా ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో తమ పేర్లు నమోదు చేసుకున్నారని అన్నారు. ఉత్సవాలన జయప్రదంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. నరసరావుపేటలోని పిఎన్‌సి అండ్ కెఆర్ కళాశాల ఆవరణలో జరిగే ఈ బాలోత్సవాలు 9వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని, 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఒకే సమయంలో 5 వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, మరో నాలుగు వేదికలపై అకడమిక్ ఈవెంట్లు జరుగుతాయని వివరించారు. సుమారు 64 ఈవెంట్లలో జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీలు ముగిసిన వెంటనే ఎప్పటికప్పుడు విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాల ప్రదానం ఉంటుందని చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకూ భోజన వసతి ఏర్పాటు చేస్తామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, సభ్యులు ఎం.ఎస్.ఆర్.కె ప్రసాద్, షేక్ మహమ్మద్ గౌస్, కోయ రామారావు, షేక్ మస్తాన్‌వలి, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రూ.82 లక్షలతో గోడౌన్ నిర్మాణం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

నాబార్డ్ నుండి రూ.82 లక్షల రుణంతో బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడేలా గోడౌన్ నిర్మిస్తున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలో శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ గోడౌన్ నిర్మాణంతో రైతులు ధాన్యం, ఎరువులను నిల్వ చేసుకునేందుకు బహుముఖంగా ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ రంగాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, మండలంలోని రైతులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చాగంటివారిపాలెంలో అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టకు మంత్రి హాజరయ్యారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఎంజెఎం రామలింగారెడ్డి, ఎస్.గోపాలరావు, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, అచ్యుత శివప్రసాద్, జి.రామిరెడ్డి, మార్కెటింగ్ డిఇ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ పీలా గాయత్రిలక్ష్మణ్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బ్రహ్మారెడ్డి, ఇతర నాయకులు

ఓటర్ల జాబితాలో అవకతవకలపై తహశీల్దార్‌కు వివరాలిచ్చిన బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - కారంపూడి

ఓటర్ల జాబితాలో అవకతవకలపై వివరాలను తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి శనివారం అందించారు. చనిపోయిన, డబుల్ ఎంట్రీ, శాశ్వతంగా వలసెళ్లిన వారి వివరాలను ఇచ్చి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చాలా మందికి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లున్నాయని చెప్పారు. జనాభా ఆధారంగా ఓట్ల శాతాన్ని ఎన్నికల కమిషన్ నిర్ణయించిందని, అయితే చనిపోయిన ఓట్లను తొలగించని కారణంగా కొత్తవారికి అవకాశం రావడం లేదని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు యు.లక్ష్మీనారాయణ, నాయకులు పి.అంజయ్య, పి.పుల్లయ్య, జి.సురేష్ యాదవ్, సిహెచ్.రాము, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన డీఐజీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి సబ్ జైలును జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జైలులో ఎంతమంది ఖైదీలున్నారు? వీరిలో శిక్షపడిన ఖైదీలు ఎంతమంది? తదితర వివరాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల బారక్‌లను పరిశీలించారు. మెను ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఖైదీలను అడిగారు. ఆయనవెంట గుంటూరు జిల్లా జైళ్ల శాఖాధికారి వీరేంద్ర ప్రసాద్, సబ్ జైలు సూపరింటెండెంట్ ఎ.కల్యాణ్‌బాబు ఉన్నారు.

8 నుండి సమ్మెలో అంగన్వాడీలంతా పాల్గొనాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు

ప్రజాశక్తి - మాచర్ల

సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు మల్లీశ్వరి

అంగన్‌వాడీలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లీశ్వరి డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు అతి తక్కువ వేతనాలతో దశాబ్దలుగా మాతా శిశు సంరక్షణ రంగంలో పని చేస్తున్నారని చెప్పారు. వారికి సరైన న్యాయం చేయటంలో అధికార పార్టీ విఫలమైందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో మాట్లాడుతూ అంగన్‌వాడి అక్క, చెల్లమ్మలకు తెలంగాణ కంటే ఒక వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానని వాగ్దానం చేశారని, ఆ హామీని ఇప్పుడు విస్మరించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేది నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. సమ్మెలో అంగన్వాడీలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు బండ్ల మహేష్, యూనియన్ నాయకులు ఉషా, శివకుమారి, సునీత, రుక్మణి, పద్మ పాల్గొన్నారు.

రైలు గేటు మూసివేస్తే పొలాలకు ఎలా వెళ్లాలి?

- ఆందోళన చేస్తామని అధికారులకు స్పష్టం చేసిన రైతులు
- రెండు గేట్లలో ఏదో ఒకటి తేల్చుకోవాలన్న అధికారులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అధికారులకు సమస్యను చెబుతున్న రైతులు



రైలు గేటు మూసివేస్తే ఆందోళన చేస్తామని అధికారులను రైతులు హెచ్చరించారు. రైలు గేటు మూసివేస్తే పంటపొలాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. మండలంలోని అబ్బూరు - గుడిపూడి మార్గంలో ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు నం.34ను మూసివేసేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. తహశీల్దార్ సురేష్, రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ టివి కృష్ణయ్య శనివారం రైల్వే గేటును సందర్శించి రైతులతో మాట్లాడారు. రైల్వే గేటు మూసివేస్తే పొలాలకు వెళ్లాలంటే లక్మీపురం మీదుగా కాల్వ కట్టపై వెళ్లాల్సి ఉంటుందని, రైతులు వివరించారు. గతంలో పాకాలపాడు, పాలడుగు వరకు రోడ్డు నిర్మించారని, గుంటూరు వెళ్లేందుకు వీలుగా వుంటుందని చెప్పారు. రైల్వే గేటు మూసివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని రైతులు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని వైసిపి నేతలు, రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే అధికారులు, తహశీల్దార్‌తో ఎంపీ చర్చించారు. అయితే లక్ష్మీపురం (గుడిపూడి స్టేషన్) వద్ద ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు నెం.33 ని కూడా మూసివేసేందుకు రైల్వే అధికారులు ప్రయత్నిస్తున్నారు. రెండు గేట్లలో ఏది కావాలో నిర్ణించుకుని ఆ మేరకు రైతులు ఆర్జీనిస్తే పరిశీలిస్తామని అధికారులు చెప్పారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులుతో అధ్యాపకులు

29 మంది న్యూటన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం అలుగురాజుపల్లి సమీపంలోని స్థానిక న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 29 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందించడం ప్రత్యేకతన్నారు. ప్రతిఏటా ప్రముఖ కంపెనీలు నిర్వహించే క్యాంపస్ సెలక్షన్లలో వందలాది మంది విద్యార్థులు ఉపాధి పొందటం శుభపరిణామమన్నారు. తాజాగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి, డీన్ సందీప్‌రెడ్డి, టిపిఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచాన్ని శాసిస్తున్న కంప్యూటర్లు

ప్రజాశక్తి - మాచర్ల

నేడు కంప్యూటర్లు ప్రపంచాన్ని శాసిస్తున్నాయని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతురావు అన్నారు. ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాలను కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం ప్రతి రంగంలో ప్రవేశించిన నేపథ్యంలో కంప్యూటర్ లేని సమాజాన్ని నేడు ఊహించుకోలేమన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం నేడు ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ప్రధానంగా విద్యార్థులు కంప్యూటర్ విజ్ఞానాన్ని ఎంత అందిపుచ్చుకుంటే అంత మంచి ఉపాధి అవకాశాలు వారికి లభిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా కంప్యూటర్ టీచర్లు ధరణ్య, రోషినిలను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రతినిధులు శ్రీధర్‌గుప్తా, సదాశివరాజు, హరిష్‌చంద్ర పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం పట్టని పాలకులు

ఐద్వా రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాసకుమారి

మాట్లాడుతున్న డి.శ్రీనివాస కుమారి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

దేశంలో రోజుకు 86 అత్యాచారాలు, ప్రతి 77 నిమిషాలకు ఒక వరకట్న హత్య, ప్రతి 48 నిమిషాలకు ఒక దళిత మహిళ అత్యాచారానికి గురవుతుందని ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర నాయకులు డి శ్రీనివాస కుమారి తెలిపారు. శనివారం ఆత్మకూరు నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్‌లో మహిళ హక్కులే - మానవ హక్కులు అంశముపై ఐద్వా నాయకులు సింహాద్రి సుమ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమారి మట్లాడుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతే మా ప్రభుత్వ విధానం అని ప్రగల్బాలు పలికే నాయకులు ఈరోజు దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులకి ఏమి సమాధానం చెబుతారో ఆలోచించాలన్నారు. అధికారానికి వస్తే మహిళ రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తామని చెప్పిన బిజెపి, పార్లమెంటులో అన్ని పార్టీలు ఆమోదించిన దానిని అమలు చెయ్యకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం చేసిన దిశ బిల్లును చట్టం కాకుండా తొక్కి పెట్టడాన్ని మహిళల పట్ల కపట ప్రేమకు నిదర్శనమన్నారు. మహిళలకు ఉపాధి, విద్య, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం చేయాలని, అత్యాచార బాధితులకు తక్షణ సాయం అందించాలని, డ్వాక్రా గ్రూపులకు జీరో వడ్డీ రుణ సదుపాయం కల్పించాలని, మహిళలకు బడ్జెట్ ను పెంచాలని, నిత్యవసర ధరలు తగ్గుదలకు, ఉపాధి పెంపుదలకు, మహిళలు గౌరవంగా జీవించేందుకు మహిళా సంఘం పోరాటాలు చేస్తుందన్నారు.ఈ పోరాటాల్లో మహిళలు ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కమిటీ సభ్యులు గౌరబత్తుల లక్ష్మి, కోడూరు సుజాత, ప్రజాసంఘాల నాయకులు ఉద్దంటి దుర్గారావు పాల్గొన్నారు.

అక్రమణకు గురైన చెరువు భూమి సర్వే చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

హైదరాబాదుకు చెందిన శ్రావణి క్యాపిటల్ లింక్ ఎల్‌ఎల్‌పి సంస్థకు చెందిన యాజమాన్యం ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామంలో సర్వేనెంబర్ 220 లో ఆక్రమించిన రెండు ఎకరాల చెరువు భూమిని సర్వే చేయాలని దళిత నాయకులు తలకాల నాగేంద్రబాబు అలియాస్ మరియ బాబు, గుండిమెడ గ్రామ దళిత యువకులు శని వారం తాడేపల్లి మండల అధికారులను డిమాండ్ చేశారు. గుండి మెడ గ్రామానికి చెందిన చెరువు భూమి ఆక్రమణకు గురైన, అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గ మన్నారు. శ్రావణి క్యాపిటల్ ఆక్రమించిన చెరువు భూమిపై హైకోర్టులో కేసు వేసి, ఇంటీరీం ఆర్డర్ కాపీ పొంది, తాడేపల్లి మండల అధికారులను సర్వే చేయమని కోరగా, తాడేపల్లి మండల తాసిల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. చెరువు భూమిని ఆక్రమించుకోవడమే కాక, కాంపౌండ్ వాల్ నిర్మించారని మరి బాబు అన్నారు. గౌరవ న్యాయ స్థానం ఇచ్చిన ఆర్డర్ కాపీ ప్రకారం సర్వే చేయమని కోరగా, సర్వేనెంబర్ 220లో ఆక్రమణ జరగలేదని తాడేపల్లి మండల తాసిల్దార్ చెప్పటం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణకు గురైన చెరువు భూమిని సర్వే చేయక పోతే గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని మరియా బాబు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం రాజేష్, ఎం సందీప్, జి వినోద్ కుమార్, ఎస్ అరుణ్ కుమార్ ,జి రాజు, ఎం సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులపై తీవ్రమైన పనిఒత్తిడి వల్ల ఆనారోగ్య సమస్యలు ఎదుకర్కొంటున్నారని, పనిఒత్తిడి తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా అన్నారు. శనివారం స్థానిక నగరంపా లెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విపరీతమైన పని ఒత్తిడి ఉండటం వల్ల వారికి దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ బారిన పడుతున్నారని, కొంత మంది గుండె పోటుకు కూడా గురవుతున్నారన్నారు. కాబట్టి ఉద్యోగు లకు పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. శారీరక శ్రమ కంటే మానసిక ఒత్తిడి చాలా ప్రమాద ౼మైనదని పేర్కొన్నారు ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించటం వలన వారి జీవన ప్రమాణం పెరుగుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల యొక్క సంక్షేమం కూడా చూడాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాంద్ భాషాతో పాటు జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు, నగర కార్యదర్శి శివారెడ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చాంద్‌భాషా

కోలాటంతో సందడి చేసిన డొక్కా

ప్రజాశక్తి - తుళ్లూరు :గుంటూరు జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. శనివారం వెంకటపాలెం లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో డొక్కా కొద్దిసేపు మహిళలతో కలిసి కోలాటం ప్రదర్శనలో పాల్గొని సందడి చేశారు. తొలుత పూజలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.డొక్కా వెంట వైసిపి నాయకులు నాయుడు నాగేశ్వర రావు,సుంకర శ్రీనివాసరావు, భోగినేని అప్పారావు, దాసరి రాజు,కాకర్ల నాగేశ్వరరావు, జమ్ముల సాంబశివరావు,మాదల వెంగలరెడ్డి, తోకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- పెదనందిపాడు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ శనివారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ స్వాతికి వినతి పత్రం ఇచ్చారు. ముందగా గత 13 రోజులుగా దీక్షలు చేస్తున్న దీక్షా శిబిరం వద్ద నుండి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు వచ్చారు. అనంతరం రైతులు నాయకులు గుంటూరు ఛానల్ సమస్యను డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఈ ప్రాంత ప్రజలు సాగు,తాగునీటి కోసం పోరాడుతున్నారని, నాయకులు ఇచ్చిన హామీలు కేవలం నోటి మాటలకే పరిమితం అయ్యాయని ఆచరణలోకి రాలేదని తెలిపారు. వెంటనే నిధులు కేటాయించి గుంటూరు చానల్ పొడిగింపు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పోపూరి వెంకటప్పయ్య, మారిశెట్టి శ్రీనివాస రావు, కల్లూరు శివ శంకర్ స్వామి, కే. పూర్ణచంద్ర రావు, కొల్లా చిన్న సాంబశివరావు, దొప్పలపూడి హనుమంత రావు, కొలిమర్ల శ్రీనివాసరావు, షేక్ జాన్ బాబు, ఏ సత్యనారాయణ, ముత్తువరపు చెంచు రామారావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

అందుబాటులో వరికోత యంత్రాలు

తుపాను నేపథ్యంలో వరికోతలకు రైతులు త్వరపడాలి : ఎడిఎ ఉషారాణి

ప్రజాశక్తి-తెనాలి

తుపాను ప్రభావాన్ని అధికమించేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరికోత యంత్రాలు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో కోతకు సిద్ధమైన వరిని వెంటనే కోయించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్.ఉషారాణి చెప్పారు. స్థానిక కార్యలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంట చేతికి వచ్చే పరిస్థితుల్లో తుపాను ప్రభావం బాధాకరమన్నారు. డివిజన్‌లో పర్యటించిన ఆమె వరిసాగు, కోతలు, కోతకు సిద్ధంగా ఉన్న వరి వివరాలను వెల్లడించారు. తెనాలి మండలంలో 12500 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటికి మూడు వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. మరో ఏడువేల ఎకరాల్లో వరి కోతకు సిద్ధమైందన్నారు. అలాగే దుగ్గిరాల మండలంలో 19700 ఎకరాల్లో వరి సాగు చేయగా, 2వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, మరో 7వేల ఎకరాలు కోతకు సిద్ధంగా ఉన్నాయన్నారు. కొల్లిపర మండలంలో 14వేల ఎకరాల్లో 600 ఎకరాలు మాత్రమే కోతలు పూర్తయ్యాయని, మరో 8వేల ఎకరాలు కోతకు సిద్ధంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో వరికోత మిషన్లు 20 అందుబాటులో ఉన్నాయని, శనివారం కోతలు ముమ్మరంగా సాగాయన్నారు. అలాగే ఆదివారం కూడా సాధ్యమైనంత మేర కోతలు కోయించాలన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి, మరి కొన్ని మిషన్లు అందుబాటులోకి తెచ్చాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది వర్షపాతం సాధారణం కటే తగ్గినా దిగుబడి మాత్రం పెరిగిందన్నారు. ఎకరానికి 38 నుంచి 45 బస్తాల దిగుబడి ఉందన్నారు. ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని, బస్తా రూ.1600 నుంచి 1750 వరకూ ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశామని, రైతులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారిని సంప్రదించ ౼వచ్చునన్నారు. రైతులు ఎంతో కష్టపడ్డారని, ఎలాగైనా ఈ తుపాను గండం కూడా గట్టెక్కాలని, రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలన్న ఆశాభావం ఆమె వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ఎడిఎ ఎన్.ఉషారాణి

పెండింగ్ వేతనాలు చెల్లించాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

ఉండవల్లి, పెనుమాక, ఎర్రబాలెం, నవులూరు, బేతపూడి గ్రామాలలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జూన్ నెల జీతం పెండింగ్ ఉందని, పెండింగ్ జీతాన్ని చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు ఎంటిఎంసి కమిషనర్ వి నిర్మల్ కుమార్‌కు ఆయన ఛాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సిఐటియు నాయకులు బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్మికుల వేతనాల విషయంలో కమిషనర్ సానుకూలంగా స్పందిచారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంటిఎంసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్ఎస్ చంగయ్య, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆర్ వేణు, గౌరవాధ్యక్షులు ఎం రవి, నాయకులు ఎస్ దివ్య, సుబ్బారావు, శాంతకుమారి పాల్గొన్నారు.

సిరిపురంలో నకిలీ విత్తన మిర్చి పొలాన్ని పరిశీలించిన ఏవో

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని సిరిపురం గ్రామంలో రైతులు సాగు చేసిన కల్తీ మిర్చి పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం నాగరాజు శనివారము బాధిత రైతులతో కలసి పరిశీలించారు. యుఎస్ అగ్రి సీడ్స్- 450 విత్తనరకంతో సాగు చేశారు. పంట పొలంఏపుగా పెరిగినప్పటికీ పూత, పిందె రావడం లేదని మొక్కలు వేసి మూడు నెలలైనా కాపు రావడంలేదని వినతి పత్రాన్ని బాధిత రైతులు వ్యవసాయ శాఖ అధికారి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతు ఈ విషయం పై జిల్లా స్థాయి ఉన్నతాధి కారులు దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటా మని రైతులకు తెలిపారు. విత్తన విక్రయ డీలర్ల పై తగిన చర్యలు చేపట్టి నష్టపోయిన బాధిత రైతులందరికీ పరిహారాన్ని అందేలా చర్యలు చేపడతామని రైతులకు చెప్పారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కాలుష్యంపై చిప్స్ విద్యార్థుల అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు ఫార్మసీ కాలేజి (చిప్స్) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినం పురస్కరించుకొని శనివారం చౌడవరంలోని వెంకటేశ్వరా బాలకుటీర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు చేతన స్కూల్ ఆవరణలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ రకాల కాలుష్యాలు, వాటి వల్ల ప్రకృతికి, భవిష్యత్ మానవాళికి సంభవించే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఇందులో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లతోపాటు ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ జె.సుబ్బారావు హాజరయ్యారు. భావి భారత పౌరులైన మనం కాలుష్య నియంత్రణకు కృషి చేయటం ఎంతో ముఖ్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు. కార్యక్రమానికి పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెట్ మరుధ్వతి పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అభిమాన సంఘం సభ్యులు

16న సూపర్‌స్టార్ కృష్ణ మ్యూజికల్ నైట్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా ఘట్టమనేని కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు ఈనెల 16న గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో హీరో కృష్ణ- మహేష్ బాబు అభిమానుల ఆత్మీయ కలయిక, సూపర్ స్టార్ కృష్ణ నటించిన సినిమా పాటలతో గ్రాండ్ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేస్తున్నట్లు నరసరావుపేట పట్టణ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి అధ్యక్షులు ఎమ్‌డి ఫారూఖ్ బాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలోని కార్తీక్ రెసిడెన్సీలో కార్యక్రమం విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫారూఖ్‌బాబు మాట్లాడుతూ సినీసంగీత ప్రియులు, సినీప్రేక్షకులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మర్రి వెంకటసుబ్బారెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు ఎమ్‌డి పర్వేజ్ చిస్టి, అభిమానులు షేక్ షంషీర్ అలీ, డి.చెన్నయ్య పాల్గొన్నారు.

ఈ-క్రాఫ్‌తోపాటు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-ఈపూరు

రబీ సాగుకు సంబంధించి ఈ-క్రాఫ్ నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు ఏవో ఆర్.రామారావు తెలిపారు. మండలంలోని వనికుంట గ్రామంలో శనగ పంటను శనివారం ఈ-క్రాఫ్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో రబీలో సాగు చేసిన పంటల వివరాలను రైతులు ఈ క్రాఫ్ లో నమోదు చేసుకోవడంతో పాటు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈ క్రాఫ్ నమోదుతోనే పంట నష్టపరిహారం, రాయితీలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై పరిశీలన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని చాగంటివారిపాలెంలో రేషన్ అందించే ఎమ్‌డియు వాహనాన్ని తహశీల్దార్ భవానీశంకర్ శనివారం తనిఖీ చేశారు. రేషన్ కార్డుదారులను నిత్యావసర సరుకులు పంపిణీ సక్రమంగా జరుగుతున్నదా? లేదా ఎమ్‌డియు సిబ్బంది నుండి ఏమైనా ఇబ్బందులకు పడుతున్నారా? అనీ అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడొద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిటి లక్ష్మీ ప్రసాద్, విఆర్వోలు పాల్గొన్నారు.

టిడిపి నుండి ఎంపీ అభ్యర్థి ఎవరు?

- ఎన్నికలు సమీపిస్తున్నా ఊసేలేని అభ్యర్థి
- ఆశాభావమూ వ్యక్తం చేయని నాయకులు

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలు టిడిపి-జనసేనకు అత్యంత కీలకంగా మారిన నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు చావా రేవా అన్నట్లు పోటీలో దిగనున్నారు. ఇదే క్రమంలో పల్నాడు జిల్లాలో తమ పార్టీకి పోటీ చేసే అవకాశం లభిస్తుందో లేదోనని జనసేన శ్రేణుల్లో సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు టిడిపి నుండి ఎంపీ అభ్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. గత రెండు ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుండి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన రాయపాటి సాంబశివరావు ప్రస్తుతం రేసులో లేనట్లు దాదాపు నిర్ధారణైంది. అయితే కొత్తవారు ఎవరనేది మాత్రం టిడిపి శ్రేణులకూ అంతుబట్టడం లేదు. తాము ఆసక్తిగా ఉన్నామని ఆశావాహులు ఎవరూ బహిరంగంగా ప్రకటించలేదు. కొంత కాలం క్రితం రాయలసీమ ప్రాంతానికి చెందిన పారిశ్రామిక వేత్త పుట్టా మహేష్ యాదవ్ పేరు ప్రచారంలోకి వచ్చినా టిడిపి అధిష్టానం

నుండి సానుకూల సంకేతాలేమీ రాలేదు.

నరసరావుపేట పార్లమెంటు స్థానం పరిధిలో నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట, పెదకూరపాడు, మాచర్ల, గురజాల, వినుకొండ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఎంపీ సీటుతోపాటు అన్ని అసెంబ్లీ స్థానాలనూ వైసిపి కైవసం చేసుకుంది. తాజా ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాలకు టిడిపి నుండి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఎంపీ స్థానానికి జిల్లాకు చెందిన వారిని ఎంపిక చేస్తారా? లేదా ఇతర జిల్లాల నుండి ఎవరినైనా పోటీలోకి దించుతారా? అనేది టిడిపి వర్గాల్లో చర్చనీయాంశమైంది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర నరసరావుపేటకు రాకుండా పోవడం వల్ల స్థానికంగా బల ప్రదర్శనకు, ఆశావాహుల హడావుడికి అవకాశం లేకుండా పోయింది. మొత్తంగా అభ్యర్థులను ఖరారు చేస్తే తామూ ఉత్సాహంగా పని చేయడానికి వీలుంటుందనే అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా బిజెపిలోని కీలక నేతను టిడిపిలో చేర్చుకుని నరసరావుపేట ఎంపీగా పోటీ చేయిస్తే ఆ స్థానాన్ని గెలవడంతోపాటు అసెంబ్లీ స్థానాల్లోనూ గెలవొచ్చనే అభిప్రాయం టిడిపి అధిష్టానం వద్ద ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు బిజెపి నేతకు ప్రతిపాదన పంపినా బాపట్ల జిల్లాలోని ఓ అసెంబ్లీ స్థానం విషయమై ఈ ప్రతిపాదన ముడిపడనట్లు తెలిసింది.

సఫాయి కర్మచారీలకు మురుగు శుద్ధి వాహనాలు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

సఫాయి కర్మ చారీలకు మురుగు శుద్ధి వాహనాలు పంపిణీ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో శనివారం జరిగింది. పల్నాడు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, షెడ్యూల్ కులాల సేవా సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమకుమారి, తదితరులు పాల్గొన్నారు. మొత్తం ఆరు యూనిట్లను సఫారీ కర్మచారీలకు మురుగునీటి శుద్ధి వాహనాలను 30 మంది సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఓబుల్ నాయుడు, నవోదయం నోడల్ ఆఫీసర్ సంజీవరావు, డీఈవో శామ్యూల్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు కారంపూడి బ్రహ్మనాయుడు జెడ్‌పి పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి - కారంపూడి

స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెలలో చిత్తూరు జిల్లాలోని బంగారుపాలెంలో జరిగిన అండర్-14 బారుల ఖోఖో పోటీల్లో కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి బి.రెయిన్‌పాల్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అనంతశివ తెలిపారు. బి.రెయిన్‌పాల్ ఈ నెల 4వ తేదీ నుండి ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థిని పిఇటిలు జె.శ్రీనివాసరావు, బి.స్వర్ణరాజు, విద్యా కమిటీ చైర్మన్ గోపి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సరైన శిక్షణిప్పిస్తే అందరిలాగే వికలాంగుల జీవనం

న్యాయమూర్తి శారద

ప్రజాశక్తి - మాచర్ల

వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శారద సూచించారు. స్థానిక సూర్య కిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకోని వారికి న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి శారద మాట్లాడుతూ దివ్యాంగులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఆయా రంగాల్లో తగు రీతిలో శిక్షణ ఇప్పిస్తే వారు కూడ సమాజంలో అందరిలా జీవిస్తారని చెప్పారు.

బాలికతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శారద

వికలాంగుల వారి పట్ల సేవా భావంతో వ్యవహరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో రామక్రిష్ణ సేవా సమతి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, సీనియర్ న్యాయవాది ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల రైతులకు శాశ్వత భూ హక్కు

ప్రజాశక్తి - కారంపూడి : అసైన్డ్, ఇనాం భూములకు శాశ్వత భూహక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీ చేసిందని తహశీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ శనివారం తెలిపారు. జీవో ప్రకారం మండలంలో 356 మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు చెప్పారు. 20 ఏళ్ల కిందట రైతులకు డీకే పట్టాలు ఇచ్చిన రైతులకు శాశ్వత భూహక్కు కల్పిస్తూ త్వరలోనే పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇనాం భూములు సంభందించి శంకరాపురం 33, చిన్న కోదమగుండ్ల 2, చింతపల్లి 50, ఒప్పిచర్ల 16, నడమలపాడు 113, కారంపూడి ముగ్గురు రైతులకు లబ్ధి చేకూరగా, అసైన్డ్ భూములు సంబంధించి ఒప్పిచర్ల 5, శంకరాపురం 12, చింతపల్లి 39, నరమాలపాడు 21, కారంపూడి 52, పేటసన్నిగండ్ల 10 మంది రైతులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరినట్లు వివరించారు.

విద్యుద్ఘాతానికి గురైన వారికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణంలోని రెడ్డి నగర్ ఆదిత్య స్కూల్ దగ్గర అద్దె ఇంట్లో నివసిస్తున్న ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబం ఒకే కుటుంబంలో 8, 6, 4 సంవత్సరాల వయసు గలిగిన ముగ్గురు అక్క చెల్లెలు రిషిత, పావన, హర్ష విద్యుద్ఘాతానికి గురైన నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్నారు. వీరిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక విఘ్నేశ్వర ఫర్టిలైజెర్స్-పెస్టిసైడ్స్ షాపు వారు 50 స్పోర్ట్స్, యోగా దుస్తులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎఇ శ్రీనివాసరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రాజేష్, పిసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, పిఇటి అరుణశ్రీ, యోగా ఉపాధ్యాయులు నాగబాబు పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్‌లో 205 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఓట్ల నమోదు, తొలగింపులుపై స్పెషల్ క్యాంపెయిన్ డే శనివారం నిర్వహించారు. మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ జియా తనిఖీ చేశారు. ఫామ్-6కు 72, ఫామ్-7కు 120, ఫామ్-8కు 13, మొత్తం 205 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
ఆదివారం 3 డిసెంబర్ 2023

వీధి దీపాలు వెలగడం లేదు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం 8వ వార్డు క్యాబిన్ పేటలో మూడు రోజులనుండి వీధి దీపాలు వెలగడం లేదని కొన్ని పోల్స్‌కు లైట్స్ లేవని స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో దొంగలు, విషసర్పాలు, కుక్కలు సంచరిస్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నామని వారు శనివారం మీడియాకు తెలిపారు. మున్సిపల్ అధికారులు సత్వరమే స్పందించి క్యాబిన్‌పేటలో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మంగళగిరిలో ట్రాఫిక్ స్టాపర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళగిరి అర్బన్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాత బస్టాండ్ సెంటర్లో ట్రాఫిక్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఎస్సై కోటేశ్వరరావు స్టాపర్ల ఏర్పాటును పరిశీలించారు. సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రధాన కూడలిగా ఉన్న పాత బస్టాండ్ సెంటర్లో స్టాపర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వాహనదారులు యూటర్న్ తీసుకునేందుకు ప్రధాన కూడళ్లలో కోన్ లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

కాపు సంక్షేమ సేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి : ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురైనా యువకుడికి కాపు సంక్షేమ సేన శనివారం రాత్రి ఆర్థిక సహాయం అందజేశారు. రేవేంద్రపాడు చెందిన సురేష్ కు కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు తిరుమల శెట్టి కొండలరావు స్పందించి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎంజి ఇన్నర్ రింగు రోడ్డులోని భాష్యం రామసేతు క్యాంపస్ వెనుక ఉన్న వెంకటేశ్వరా ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో నేడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కొండా ఎంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్య బృందంతో నాడి పరీక్షించి, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, సోరియాసిస్, గ్యాస్ట్రబుల్, మలబద్ధకం, సెక్స్ సమస్యలు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ వైద్యశిబిరం ప్రారంభానికి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, భాష్యం చైర్మన్ భాష్య రామకృష్ణ, ఇఎస్ కన్‌స్ట్రక్షన్స్ ఎండి ఈదా సాంబిరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. కావున ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఓటు నమోదు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ గుడ్‌న్యూస్ హైస్కూల్లో పోలింగ్ బూత్‌లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, ఫారం 6, 7, 8 ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా చూడాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఒకే ప్రాంతంలో ఒకే డోర్ నెంబర్ మీద అధికంగా ఓటర్లు నమోదైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న బిఎల్‌ఒలతో ఎంత మంది ఓటర్లు తమ పేర్లు సరి చేసుకున్నారు, ఎన్ని ఫిర్యాదులు అందాయి, మార్పులకు అందిన దరఖాస్తులు ఎన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరులో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బిల్డింగ్ స్థానములో నూతన భవన నిర్మాణము విషయమై తహశీల్దారు, పొన్నూరు, టౌన్ ప్లానింగ్ అధికారులు జాయింట్ కలెక్టర్ రాజకుమారి శనివారం పరిశీలించారు . అనంతరం నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బి ఎల్ ఓ రిజిస్టరు నిర్వహణపై బూత్ లెవెల్ అధికారులతో జెసి సమీక్ష నిర్వహించారు. ఒకే డోర్ నెంబరు లో గల 10 మంది కన్నా ఎక్కువ ఓటర్లు, జీరో డోర్ నెంబర్లు, డెత్ ఓటర్లు వంటి సమస్యలపై విచారణ జరిపి సత్వర చర్యలు తీసుకోనవలసినదిగా తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు ర్యాంప్, మంచి నీరు, టాయిలెట్, లైట్స్ ఫాన్స్ మొదలగు సదుపాయములపై తగు చర్యలు తీసుకోనవలసినదిగా పొన్నూరు మునిసిపాల్ కమిషనర్ నయీమ్ అహమద్ తెలిపారు.

ప్రజాశక్తి మంగళగిరి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 లో భాగంగా పోలింగ్ స్టేషన్ల లో బూత్ లెవల్ అధికారులు శనివారం అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించారు. మంగళగిరి అర్బన్ పరిధి లోని అన్ని పోలింగ్ కేంద్రాలను పోలింగ్ అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, అడిషనల్ కమీషనర్ కె హేమ మాలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా విడుదల అయిన ఓటర్ల జాబితాలో ఓటర్లు తమ పేరు ఉందో లేదో చూసుకోవచ్చునని ఏవైనా తప్పులు ఉన్నప్పటికీ సరి చేసుకోవాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6, ఓట్ల తొలగింపు కోసం ఫారం 7 ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, సవరణల కోసం ఫారం 8 లను సమర్పించాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బి ఎల్ ఓ లు అందుబాటులో ఉంటారని డిసెంబర్ 3 ఆదివారం కూడా ఈ స్పెషల్ క్యాంప్ జరుగుతుందని అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : ఓటర్ల నమోదు మరియు మార్పు చేర్పులకు సంబంధించిన ప్రత్యేక క్యాంపు సందర్శనలో భాగంగా మండలంలోని గుండవరం మరియు పాత రెడ్డిపాలెం గ్రామాలలో ఎన్నికల పోలింగ్ స్టేషన్లను తహశీల్దార్ కెవి గోపాల కృష్ణ సందర్శించారు. శేకూరు మరియు శలపాడు గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లలో బిఎల్‌ఒలు నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపును సందర్శించి ఓట్ల నమోదు మార్పు చేర్పులకు సంబంధించిన పత్రాలను తాసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బి ఎల్ వో లు ఓటర్ల జాబితా నిర్వహణలో సమర్థవంతంగా నియమ నిబంధనలను పాటించాలని, ఏ ఒక్కరి ఓటు తీసివేసే హక్కు, చేర్చే అధికారం తమకు లేదని అర్జీ దారుల సమ్మతితోనే నమోదు మార్పు చేర్పులు చేయాలని బిఎల్‌ఓ లకు సూచించారు.

దుగ్గిరాలలో భూహక్కు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - దుగ్గిరాల : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 22 ఏ నిషేధిత జాబితా నుండి ప్రభుత్వం నిబంధనలకు లోబడి ఉన్న పొలాలకు శాశ్వత భూ హక్కు కల్పించారని, ఇది సాహసోపేతమైన చర్యని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శనివారం జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష కార్యక్రమంలో భాగంగా పట్టాల పంపిణీ చేపట్టారు. మండలంలోని ఏడు గ్రామాల్లో సమగ్ర భూ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. శృంగారపురం, మోరంపూడి , తుమ్మపూడి గ్రామాలకు చెందిన భూ యజమానులకు పట్టా లను పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగ కుండా రెవెన్యూ వారే హద్దులు నిర్ణయించి రాళ్లు కూడా వేసి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, ఎంపీపీ దానబోయిన సంతోషరూప వాణి, జడ్పీటిసి మేకతోటి అరుణ, యార్డు చైర్మన్ షేక్ బాజీ, శృంగారపురము, రేవేంద్రపాడు, తుమ్మపూడి సర్పంచ్ కొండూరు సుధారాణి, పలుకూరు మేరమ్మ, షేక్ అజి జూన్, తహసిల్దార్ కే మల్లేశ్వరి, ఇన్చార్జి ఎంపిడిఒ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీ రంజని

వడ్డమానులో 'పొలం బడి'

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని వడ్డమానులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం శనివారం జరిగింది. పత్తిపొలంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమావేశమయ్యారు. అరోగ్యవంతమైన పంటను సాగుచేయడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం, ప్రతి వారం పొలం పరిసరాలను పరిశీలించడంలో నైపుణ్యాంను పెంపొందించుకోవడంపై రైతులకు వ్యవసాయాధికారి కె శ్రీ రంజని సూచనలు చేశారు. వ్యవసాయశాఖ సూచనలను పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో రైతులు బుర్రా రామకష్ణారెడ్డి,వెంకట శివారెడ్డి,చుండు వెంకటరెడ్డి,పిన్నక అప్పారావు, పుచ్చకాయల సాంబశివరావు పాల్గొన్నారు.

సాహిత్య కళా ఉత్సవాలకు 'ఆళ్ల'కు ఆహ్వానం

ప్రజాశక్తి- తెనాలి : అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు పట్టణానికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావుకు ఆహ్వానం అందింది. సంస్థ చైర్మన్ డాక్టర్ కె ప్రతాప్ సారథ్యంలో డిసెంబర్ 16, 17 పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో ఈ ఉత్సవాలు జరుగుతాయని, సమన్వయ కర్త కొల్లి రమావతి నుంచి ఆహ్వాన పత్రికను శనివారం అందుకున్నట్లు ఆళ్ళ తెలిపారు.

ముక్కోటి ఏర్పాట్లపై 5న సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 23వతేదీ ముక్కోటీ వైకుంఠఏకాదశి సందర్భంగా ఏర్పాట్లు, భక్తులకు వసతి సౌకర్యాల కల్పనపై ఈనెల 5వతేదీన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇవో ఎ రామకోటిరెడ్డి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ ఎంహెచ్ పాల్గొంటారని ఆయన తెలిపారు. అదే రోజు టిడ్కోగృహ సముదాయం వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను, దాత దేవతి భగవన్నారాయణ నిర్మించి ఇచ్చిన అన్నప్రసాద భవనాన్ని ఆర్కే ప్రారంభిస్తారని ఇవో వెల్లడించారు.

రైతులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న పీడీ రామాంజనేయులు

విత్తన తయారీపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గ్రామీణ విత్తన పథకం కింద శనివారం రైతులకు శిక్షణ నిర్వహించారు. గ్రామీణ బుర్రుపాలెం, సంఘం జాగర్లమూడి గ్రామాల్లో నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా మండల కేంద్రం పిడి రామాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులు సొంతగా విత్తనాలను తయారు చేసుకోవాలని సూచించారు. చేతికందిన వరి పంటను సకాలంలో కోతకు సిద్ధపరచాలన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను రైతులను నష్టపరచకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. హార్వెస్టర్ల సహాయంతో చేతికిందిన పంటను త్వరితగతిన కోయించాలని సూచించారు. పంట కోసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రాజ వంశి, ఏవో ప్రేమ సాగర్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎ లు గోపీనాథ్, ప్రజ్ఞ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళతాం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను న్యాయపరంగా హింసించిన వైనాన్ని ప్రజలకు వివరించి చైతన్యం పరుస్తామని తెనాలి టిడిపి లీగల్ సెల్ నేతలు అన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచనలతో శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ లీగల్ సెల్ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది తాడిబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చట్టాన్ని అతిక్రమించి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులను మోపడం దుర్మార్గమన్నారు. చట్టవ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వ తీరును ఖచ్చితంగా ప్రజాక్షేత్రంలో వివరిస్తూ జగన్ అవినీతి పాలన విధానాలను ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో "వై ఎపి హేట్స్ జగన్ " అనే విషయాలను పాలకులకు అర్థమయ్యే విధంగా ఉద్యమిస్తామన్నారు. లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మద్ది మల్లిఖార్జున రావు మాట్లాడుతూ టిడిపి నేతల గొంతు నొక్కే విధంగా అక్రమ కేసులు పెడుతున్న వారిపై న్యాయ పరమైన పోరాటం చేస్తామన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ సహకారంతో టిడిపి కేడర్ లో ధైర్యాన్ని నింపుతామని చెప్పారు. కార్యక్రమంలో కనక రాంబాబు, కీలారి అనిత, జగదీశ్వరి, లలిత, వెంకటేశ్వరరావు, కిషోర్, ప్రదీప్, కొండలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి న్యాయవాదులు

15 నుండి ఆడుదాం ఆంధ్రా పోటీలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పిస్తుందని ఆసక్తి ఉన్నవారు అందుబాటులోని వార్డుసచివాలయంలో పేరు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. డిశంబర్ 15 నుండి జరిగే ఆడుదాం ఆంధ్ర ద్వారా 15 ఏళ్ల వయస్సు పైబడి క్రీడల పట్ల ఆసక్తి ఉండి, అవకాశం కోసం ఎదురు చూసే వారికి రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుండి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక్కో క్రీడాకారుడు గరిష్టంగా 2 ఆటల్లో పాల్గొనవచ్చని, ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనకూడదన్నారు. గుంటూరు నగర పరిధిలోని వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారి నుండి వివరాలు తీసుకొని ఆన్ లైన్ చేస్తున్నారని, డిశంబర్ 13 వరకు రిజిస్ట్రేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. 15ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు, జిల్లా స్థాయిలో విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు, రాష్ట్ర స్థాయిలో విన్నర్స్‌కు రూ.5 లక్షలు, రన్నర్స్‌కు రూ.3లక్షలు, తతీయ స్థానం సాధించిన వారికి రూ.2 లక్షలు నగదు బహుమతులు ఉంటాయన్నారు. నగర యువత పెద్ద ఎత్తున క్రీడా పోటీల్లో పాల్గొని నగరానికి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ఆర్‌విఆర్‌లో ముగిసిన హ్యాకథాన్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

పరిశ్రమల్లో నెలకొనే సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించే నైపుణ్యాన్ని విద్యార్థి దశలోనే పెంపొందించుకునేందుకు, హ్యాకథాన్ వంటి పోటీలు దోహదపడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాలలో ఉద్వికాష్ పేరుతో శుక్రవారం ప్రారంభించిన హ్యాకథాన్ పోటీలు శనివారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక మూడు రాష్ట్రాలలోని వివిధ కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వైజాగ్, గీతం యూనివర్సిటీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 35,000ల నగదు బహుమతి, హైదరాబాద్ సిబిఐటి జట్టు రెండవ స్థానంలో నిలిచి రూ.25,000లనగదు బహుమతిని, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ జట్టు మూడవ స్థానంలో నిలిచి రూ.15,000ల నగదు బహుమతిని అందుకున్నారు. ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వివిధ కాళాశాలల విద్యార్థులతో విజ్ఞానాన్ని పంచుకొనే అవకాశం దొరుకుతుందని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ నూతన ఆవిష్కరణల్లో, సమస్యల పరిష్కారాల్లో జరిపే పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా వుండాలన్నారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు, కళాశాల ఐఐసి కన్వీనర్ డాక్టర్ నాగ మల్లేశ్వరరావు, సిఎస్‌బిఎస్, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎమ్.వి.పి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీఖర్

ఆర్‌విఆర్‌లో ఓటు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శనివారం ఓటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని గుంటూరు ఆర్డీఒ పి.శ్రీకర్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఓటు విలువను, దాని ఆవశ్యకతను ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు సరైన ఆలోచనలతో ఓటును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కును సంపాదించుకున్న యువత ఎన్నిక ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ప్రలోభాలకు గురికాకుండా ఆలోచనాత్మక నిర్ణయాలతో ఓటు హక్కును వినియోగించుకొని అభివద్ధిలో భాగస్వాములవ్వాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కె.సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజలాలపై మరో వివాదం

కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య కొత్త వివాదం తలెత్తింది. ఈనేపథ్యంలో కృష్ణాడెల్టాకు కీలకమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కేంద్రం పరిధిలోకి తీసుకువెళ్లడం ద్వారా వల్ల ఒన గూరే ప్రయోజనాలు ఏమిటన్న అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేంద్రంలో ఒకపార్టీ అధికారంలోకి ఉండి, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉంటే రాజకీయ వైరంతో నీటి విడుదలపై తరచూ ఢిల్లీ చుట్టూ ఉన్నతాధికారులు చెక్కర్లు కొట్టాల్సిన పరిస్థితులు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రం పరిధిలోకి తీసుకురావడానికి గతంలోనే ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ తెలంగాణ లోని కెసిఆర్ ప్రభుత్వం వ్యతిరేకించడం వల్ల అప్పట్లో ఈ ప్రయత్నాలకు గండి పడింది. మూడు రోజుల క్రితం తెలంగాణ ఎన్నికల పోలింగ్‌కు సిద్ధం అవుతున్న తరుణంలో వైసిపి ప్రభుత్వం పోలీసుల సాయంతో నాగార్జున సాగర్ డ్యామ్‌ను తమ అధీనంలోకి తీసుకుంది. మొత్తం 26 గేట్లకు గాను 13 గేట్లను ఎపి అధీనంలోకి తీసుకుంటూ సాగర్ క్రస్ట్‌గేట్ల నుంచి నీటిని విడుదల చేశారు. తాగునీటి అవసరాల పేరుతో మూడు రోజుల్లో 9 వేల క్యూసెక్కులను నీటిని కుడికాల్వలకు విడుదల చేశారు. ఈ వ్యవహారంపై పెద్ద దుమారం చెలరేగింది. ఇదే అదనుగా కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టును తన అధీనంలోకి తీసుకుంది. సిఆర్‌ఫిఎఫ్ బలగాలను రప్పించి భద్రత బాధ్యతను అప్పగించారు. రెండు తెలుగు రాష్ట్రాల పోలీసులతో పాటు సిఆర్‌పిఎఫ్ బలగాలు కూడా డ్యామ్ భద్రతలో పాలు పంచుకోనున్నాయి. కేంద్ర బలగాలతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పోలీసుబలగాలు బందోబస్తులో ఉన్నాయి. తెలంగాణ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత 6వ తేదీన కేంద్రం నిర్వహించే సమావేశం తరువాత డ్యామ్ నుంచి తమ బలగాలు కొనసాగించాలా...ఉపసంహరించాలా అనే అంశంపై నిర్ణయం తీసుకుం టామని పోలీసు అధికారులు చెబుతున్నారు. సాగర్ నుంచి తాగునీటి విడుదల కోసం ప్రభుత్వం ఇంత హడావుడి చేయడం వల్ల రైతులకు ఒరిగిన ప్రయోజనం ఏమిలేదు. నిబంధనల ప్రకారం అక్టోబరులో ఐదు టిఎంసిల నీటిని తాగునీటి అవసరాలకు తీసుకున్నారు. ఇప్పుడు ఎటువంటి విజ్ఞాపన లేకుండా దూకుడుగా వ్యవహరించంచడాన్ని కృష్ణాయాజమాన్య బోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. అయితే ఇంత హడావుడి చేసిన ప్రభుత్వం మూడు రోజుల్లో విడుదల చేసిన నీరు కేవలం 9000 వేల క్యూసెక్కులు విడుదల చేయగలిగారు. ఒక టిఎంసి కన్నా తక్కువ నీటి వినియోగం కోసం ఇంత హడావుడి అవసరమా అన్న విమర్శలు లేకపోలేదు. అక్టోబరునెలలో తీవ్ర వర్షాభావం, 21రోజుల పాటు వేడిగాలులతో పంటలు బెట్టకు వచ్చి రైతులు నీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం స్పందించలేదు. సాగర్‌లో నీటి నిల్వలు లేవని కేవలం తాగునీటి కోసం మాత్రమే నీరు ఇవ్వగలమని అప్పట్లో మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. నవంబరులో అడపా దడపా కురిసిన వర్షాలతో పంటలకు కొంత ఊరట లభించింది. అయితే గతనెల 15న సిఎం మాచర్ల పర్యటన సందర్భంగా రైతులు, పలువురు వైసిపి నాయకులు పల్నాడులో కరువు తీవ్రతను ప్రస్తావించారు. ప్రధానంగా మిర్చి,పత్తి పంటలు ఎండిపోతున్నాయని సిఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలను పంటలను కాపాడేందుకు సాగర్ నుంచి నీటిని వినియోగించుకునే అవకాశం లేకపోవడంతో ఏదో విధంగా రైతులను సంతృప్తిపరిచేందుకు సిఎం జగన్ తెలంగాణ ఎన్నికల పోలింగ్ వేళ అత్యంత వ్యూహాత్మ కంగా సాగర్ ప్రాజెక్టును తమ అధీనంలోకి తీసుకుని నీటి విడుదల చేయడం ద్వారా రైతుల్లో సానుకూలత సాధించారని వైసిపి నాయకులు చెబుతున్నారు. అంతేగాక తాను శంకుస్థాపన చేసిన వరికపూడి శెలపై తెలం గాణ ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదు చేయడాన్ని కూడా సిఎం జగన్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రతి విషయానికి కేంద్రాన్నికి ఫిర్యాదు చేయడం ఏమిటని ఆయన తెలంగాణ ప్రభు త్వం మొత్తం ఎన్నికల పోలింగ్ బిజిలో ఉండగా అదను చూసి పోలీసు బలగాలతో సాగర్ ప్రాజెక్టులో మన వాటా వరకు అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారని వైసిపి సీనియర్ నాయకులు చెబుతున్నారు. ఈ వివాదం మరింత పెరుగుతుందా...రాజకీయ రంగు పులుముకొని మరింత తీవ్రం అవుతుందా అన్న అంశపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

(ఎ.వి.డి.శర్మ)

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

ఓటర్ల ప్రత్యేక శిబిరాలు తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఓటర్ల ప్రత్యేక శిబిరాల్లో బిఎల్ఓలు పోలింగ్ కేంద్రాలలో నిర్దేశిత సమయం ఉండి ఓటర్లకు అవసరమైన దరఖాస్తులు అందించడం, వారి నుండి తగిన వివరాలు పూర్తిచేసిన దరఖాస్తులు తీసుకోవాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు ఈఆర్ఓ కీర్తి చేకూరి అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని 532 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లను కమిషనర్, ఏఈఆర్‌ఓలు పరిశీలించారు. స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో కమిషనర్ బొంగరాలబీడు లూర్దు స్కూల్, కొత్తపేట ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్‌లలోని పోలింగ్ బూత్‌ల్లో బిఎల్‌ఓల పనితీరుని ఆకస్మిక తనిఖీ చేసి, రిజిస్టర్లు, గుర్తింపు కార్డులు, దరఖాస్తులను పరిశీలించారు. ఇండియన్ స్ప్రింగ్ స్కూల్ 108 నంబర్ పోలింగ్ బూత్ బిఎల్ఓ ఎన్.సంగీతరావు బిఎల్ఓ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడం పై షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఏఈఆర్‌ఓని ఆదేశించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలోని పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్ జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా బిఎల్ఓలు ఓటర్ల జాబితా, వివిధ ఫారాలతో అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా బిఎల్ఓలు నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు కల్గిన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ ఓటు ఉన్నది, లేనిదీ స్వయంగా పరిశీలించుకోవాలని, ఓటరు కార్డ్‌లో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సంబధిత బిఎల్ఓకి నిబందనల మేరకు తగిన ఆధారాలతో దరఖాస్తు పూర్తిచేసి అందించాలని తెలిపారు. జనవరి 5 న ఓటర్ల తుది జాబితా విడుదలకు ఎన్నికల సంఘం గడవు ప్రకటించినందున, ఓటర్ల జాబితా ముసాయిదా సవరణకు ఇదే ఆఖరి అవకాశమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఈఆర్ఓ బి.శ్రీనివాసరావు, సూపర్వైజరి అధికారులు సేతుబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చలపతి ప్రిన్సిపాల్ రామారావుకు అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావును చెన్నై యాంటీ వైరల్ రీసెర్చ్ సొసైటీ వారు అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించారు. అలాగే చలపతి కళాశాలకు బెస్ట్ అకడమిక్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అవార్డు దక్కింది. ఈ అవార్డులను డిసెంబర్, 1, 2 తేదీల్లో చెన్నైలోని యూనివర్సిటీ ఆఫ్ మద్రాసులో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ త్యాగరాజన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యస్.వలుమలై, ఎంవిఆర్‌ఎస్ అధ్యక్షులు డాక్టర్ పి.సెల్వమ్ అందచేశారు. ఫార్మా విద్యారంగంలో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు చలపతి ఫార్మసీ కాలేజిలో ప్రొఫెసర్‌గా,ప్రిన్సిపాల్‌గా సేవలు అందిస్తూ 200లకుపైగా పరిశోధనా పత్రాలు, ఏడు పుస్తుకాలు రచించి, 3 పేటెంట్లు సొంతం చేసుకున్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడి నియమితులై నాణ్యమైన ఫార్మసీ విద్యకు ఎన్నో నూతన ఆవిష్కరణలు చేసి, సమాజంలో మన్ననలు పొందారు. పరిశోధనకు పెద్ద పీట వేస్తూ 32 మంది విద్యార్థులు డాక్టరేట్ పొందటానికి మార్గనిర్దేశం చేశారు. గతంలో ఆయన పలు అవార్డులను అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ రామారావు

చలపతిలో ముగిసిన అమెజాన్ వెబ్ సర్వీసు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై వారం రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తలుగా ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధులు షేక్.ఖాసిం, మేనేజింగ్ డైరెక్టర్ వి.రాజేష్, యం.పవన్, టెక్నికల్ ట్రైనర్‌లు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో అమెజాన్ వెబ్ సర్వీసుల వినియోగం, ప్రాముఖ్యత, దాని వాడకం గురించి వివరించారు. అలాగే ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత దృష్ట్యా విద్యార్థులు నూతన సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, అందుకుగాను ఇలాంటి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్పారు. కళాశాల సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలాజీ మాట్లాడుతూ ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటటానికి ఉపయోగపడతాయన్నారు.